

పంటలపై ఏనుగుల దాడి
పట్టించుకోని అధికారులు


ఏనుగుల దాడిలో ధ్వంసమైన అరటి తోట

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: పంట పొలాలపై ఏనుగు దాడులు అధికమై పోతున్నాయని, అధికారులు స్పందించడం లేదని నష్టపోయిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం రాత్రి మండలంలోని ఎగువ కంతల చెరువు గ్రామంలో ఏనుగులు దాడులు చేసి అరటి, వరి మామిడి పంటలను భారీ స్థాయిలో నాశనం చేశాయని బాధిత రైతులు భాస్కర్, మునికృష్ణ, వెంకటేష్ ,ఈశ్వరయ్య, ప్రకాష్, దేవేంద్ర, రాధా , కుమారస్వామి పేర్కొన్నారు. రైతులు మాట్లాడుతూ తమకు చెందిన సంబంధించిన అరటి , మామిడి, వరి పంటలను ధ్వంసం చేశాయని ఏనుగుల దాడులు నివారించేందుకు అటవీ శాఖ అధికారులు తగిన ఏర్పాట్లు చేయకపోగా, కనీసం వాటి కదలికలను గుర్తించక నిమ్మకు నిరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టం చేసినప్పుడు తక్కువ మోతాదులో నష్టపరిహారాన్ని చెల్లిస్తున్నారని పెట్టుబడికి పెట్టిన డబ్బులు కూడా నష్టపరిహారం కింద చెల్లించడం లేదని దీన్ని పెంచాలని కోరారు. ఏనుగుల దాడులను నివారించేందుకు కందకాలు, సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి రైతులను కాపాడాలని అభ్యర్థించారు. ఇకనైనా అటవీ శాఖ సిబ్బంది స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు.





బర్డ్‌ఫ్లూ భయం

బిజినె(లె)స్...బేజారు


- కిలో రూ.150కి పడిపోయిన ధర
- గురుకులాల్లోనూ పదిరోజులు 'బ్రేక్'

ప్రజాశక్తి - రామచంద్రాపురం

'బర్డ్‌ఫ్లూ' భయం తిరుపతి, చిత్తూరు జిల్లాలను వెంటాడుతోంది.. మొన్నటివరకు చిన్న చిన్న చికెన్ అంగళ్లలో 150-200 కిలోల అమ్మకాలు జరిగేవి. ప్రస్తుతం పది కిలోలు కూడా పోవడం లేదన్నది చిరువ్యాపారుల ఆవేదన. ఎక్కడో బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్ జిల్లాను కుదిపేస్తోందని వారు వాపోతున్నారు. ఈనెల 16వ తేదీ ఆదివారం కూడా అమ్మకాలు సగానికి పైనే పడిపోయే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. చికెన్ వ్యాపారం కుదేలు కావడంతో బాయిలర్ కోళ్ల పెంపకందార్లు దిక్కుతోచకుండా ఉన్నారు. బాయిలర్, లింగాపురం, లేయర్ కోళ్ల మాంసం ధరలు తగ్గిపోయాయి. చికెన్ సెంటర్ల వైపు కష్టమర్లు కన్నెత్తి చూసే పరిస్థితి లేదని షాపు యజమానులు వాపోతున్నారు. వారంరోజులుగా చికెన్ వ్యాపారం నష్టాలనే చవిచూస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణ పరిస్థితుల్లో మార్పుల వల్లనో, ఇటీవల పులికాట్ సరస్సులో నిర్వహించిన ఫ్లమింగ్ ఫెస్టివల్స్‌కు వివిధ దేశాల నుంచి పక్షులు రావడం వల్లనో 'బర్డ్‌ఫ్లూ' వచ్చి ఉంటుందని పెద్దఎత్తున ప్రచారం జరుగుతుండడంతో 'చికెన్' ప్రియులు 'చేపలు' కొనుక్కుని తినే పరిస్థితి. చికెన్ ధరలు 240 నుండి 150 రూపాయలకు తగ్గింది. కోడిగుడ్ల ధర ఆరు రూపాయల నుండి ఐదు రూపాయలకు తగ్గింది. బర్డ్ ఫ్లూ వ్యాధి వ్యాప్తి చెందుతుందన్న అపోహతో చికెన్ కోడిగుడ్ల ధరలు తగ్గిపోవడంతో వ్యాపారస్తులు, పౌల్ట్రీ యజమానులు భారీ నష్టాలను చవి చూడాల్సి వస్తుంది. రామచంద్రాపురం మండలంలో 13 లేయర్, 3 బాయిలర్ పౌల్ట్రీలు ఉన్నాయి. కమ్మపల్లి, పారకాలువ, నెన్నూరు, గణేశ్వరపురం, లింగమనాయుడు కండ్రిగ, వెంకట్రామాపురం, కమ్మకండ్రిగ, సి.రామాపురం, రామచంద్రాపురం గ్రామాల్లోని కోళ్ల ఫారాల్లో ఏడు లక్షల గుడ్లు పెట్టే కోళ్లను పెంచుతున్నారు. రేకలచేను, కొత్తవేపకుప్పం, కుప్పంబాదూరు గ్రామాల్లో 10వేల బ్రాయిలర్ కోళ్లను పెంచుతున్నారు. వారంలో 12వేల పెరటికోళ్లను పెంచుతున్నట్లు పశు సంవర్థక శాఖ అధికారుల లెక్కలు. కోళ్లఫారాల వద్ద ఈగలు, దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోళ్లఫారాల యజమానులకు సూచనలు ఇచ్చామని కమ్మపల్లి పశు వైద్యాధికారి డాక్టర్ జయకుమార్ తెలిపారు. కొద్దిరోజులపాటు కోడి మాంసం, గుడ్లను 100 డిగ్రీల ఉష్ణోగ్రతలో ఉడికిన తర్వాత తినాలని సూచించారు. భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.


హేమంత్ చికెన్ సెంటర్‌లో కొనేవారు లేక ఖాళీగా సిబ్బంది

తీసుకోవాల్సిన జాగ్రత్తలు
డాక్టర్ జయకుమార్, పశువైద్యాధికారి



కోళ్లకు ఏవిఎన్ ఇంఫ్లుఎంజా వైరస్ సోకడం వల్ల బర్డ్ ఫ్లూతో చనిపోతున్నాయి. బర్డ్ ఫ్లూ వచ్చిన కోళ్లకు కోళ్ల ఫారంలో ఉపయోగించిన దాణా, కోడి మాంసం, వ్యర్థాలను జాగ్రత్తగా పాలిథిన్ సంచిలో పెట్టి దూర ప్రాంతంలో పూడ్చి పెట్టడం గాని, కాల్చివేయడం గాని చేయాలి. కోళ్ల షెడ్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో ప్రతిరోజూ శుభ్రపరుచుకోవాలి. కూలీలు కోళ్ల ఫారంలోకి ప్రవేశించేటప్పుడు చేతులు, కాళ్లు డెటాయిల్‌తో పరిశుభ్రం చేసుకోవాలి. ప్రస్తుతం ఈ వ్యాధి తిరుపతి పరిసర ప్రాంతాలలో లేదు. వ్యాధి ఎక్కడా లేనందున ముందస్తు జాగ్రత్తలు ప్రజలు తపనిసరిగా తీసుకోవాలి. బయట ప్రాంతాల నుంచి నుంచి కోళ్లను దిగుమతి చేసుకోకుండా చెక్ పోస్ట్ వద్ద ప్రత్యేక నిఘాను జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఎవరికైనా కోడి మాంసం తిన్న తరువాత జ్వరం, గొంతు బొంగురు పోవడం, ముక్కుకారడం, శరీరంపై దద్దుర్లు, ఒళ్ల నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారికి చూపించుకోవాలి.

చికెన్ కొనే వాళ్లు తగ్గిపోయారు :
కె.హేమంత్, చికెన్‌సెంటర్, చుట్టుగుంట రామాపురం

కోళ్లకు బర్డ్ ఫ్లూ వ్యాధి సోకిందని ప్రచారం కావడంతో గ్రామాలలో చికెన్ కొనేవాళ్లు పూర్తిగా తగ్గిపోయారు. గతంలో రోజుకు 300 కేజీలు అమ్మేవాళ్లం, ఇప్పుడు కనీసం 10 కేజీలు కూడా కొనేవాళ్ళు లేరు. కోడిగుడ్ల ధరలు కూడా తగ్గిపోయాయి. బర్డ్ ఫ్లూ మా పాలిట శాపంగా మారింది. అధిక రేట్లు పెట్టి కోళ్లు కొన్నాం. అమ్ముడు పోకపోవడంతో తక్కువ ధరలకు ఇచ్చిన కొనడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

పెట్టుబడి కూడా రాదు : సిద్దయ్య, కోళ్లఫారం రైతు, యాదమరి

చికెన్ రేట్లు తగ్గితే మాకు పెట్టుబడి కూడా రాదు. మేము కోళ్ల ఫారం పెంపకం దారులం. మాకు లీజుకి ఇచ్చే కంపెనీలు కూడా రేట్లు తగ్గిస్తారు. దీంతో మాకు పెట్టిన పెట్టుబడి కూడా గిట్టుబాటు కాదు. కోళ్ల ఫారాల్లో పారిశుధ్యం చర్యలు చేపడుతున్నాము. వెటర్నరీ అధికారులు వచ్చి పరిశీలిస్తున్నారు. ప్రస్తుతానికి కోళ్లు ఏమీ చనిపోవడం లేదు. ఆరోగ్యకరంగానే ఉన్నాయి. ఎక్కడ రేట్లు పడిపోతాయోనని ఆందోళనగా ఉంది.

కోళ్ల పరిశ్రమ ధమాల్

చిత్తూరు జిల్లాలో 8వేల కుటుంబాలు కోళ్ల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నాయి. అలాగే 20వేల కుటుంబాలకు ఉపాధి లభిస్తుంది. కోళ్ల ఫారాల్లో 70 లక్షల నుండి 80 లక్షల వరకు బాయిలర్స్, మూడు లక్షల నాటు కోళ్లు, 45 లక్షల లేయర్స్ కోళ్లు, లింగాపురం లక్ష వరకు పెంపకం సాగుతుంది. రోజువారి బాయిలర్స్ రెండు లక్షల కోళ్ళు కడప, చెన్నయ్, అనంతపురం, కర్ణాటక, తమిళనాడుకు సరఫరా అవుతుంటాయి. మరో 50 వేల కోళ్లు జిల్లా నలుమూలలకు సరఫరా అవుతున్నట్టు పౌల్ట్రీ రంగాల లెక్కలు చెబుతున్నాయి. గత వారంలో చికెన్ ధరలు 250 వరకు పలికింది. ప్రస్తుతం రూ.175కు దిగజారింది.

గురుకులాల్లో పది రోజులు బ్రేక్ : పి.మాధవీలత, ప్రిన్సిపాల్, కేవస్జీ గురుకులం ప్రిన్సిపాల్, శ్రీకాళహస్తి

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని గురుకులాల్లో పది రోజులపాటు విద్యార్థులకు చికెన్ వండి పెట్టరాదని బుధవారమే అధికారిక ఆదేశాలు అందాయి. ఆ మేరకు మంగళ, ఆదివారాల్లో పౌష్టికాహారంలో భాగంగా విద్యార్థులకు అందజేస్తున్న చికెన్ స్థానంలో మరేదైనా కర్రీ వండి పెట్టాలని సూచించాం.

దామోదరం సంజీవయ్య ఆదర్శనీయులు
కలెక్టర్ సుమిత్‌కుమార్


నివాళులర్పిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : దేశం గర్వించ తగ్గ మహనీయుడు దామోదరం సంజీవయ్య అందరికీ ఆదర్శనీయులని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్ లోని పాత గ్రీవెన్స్ హాలులో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రి దామోదరం సంజీవయ్య 104వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్ కుమార్‌తో పాటు చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, చిత్తూరు నగర పాలక సంస్థ మేయర్ ఆముద, డిఆర్‌ఓ మోహన్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ హిమ వంశీ, సాంఘిక సంక్షేమ శాఖ డిడిజి చిన్నయ్య పాల్గొని సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశం గర్వించ తగ్గ మహనీయుడు దామోదరం సంజీవయ్యని ఆయన పేర్కొన్నారు. ఎస్టీ, ఎస్సీ, ప్రాంతాల అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మాట్లాడుతూ బహుముఖ ప్రజ్ఞాశాలి దామోదరం సంజీవయ్యను ఆదర్శంగా తీసుకొని ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన సాగిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఆయన సేవలను డివిఅండ్‌యం సి సభ్యులు మునీంద్ర నాయక్, రాజ్ కుమార్, మునస్వామి వివరించి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎస్‌మూర్తి, డిఈఓ వరలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది గిరిజన, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్: జిల్లా సచివాలయంలో పాత గ్రీవెన్స్ హాలులో ఏపీ మాజీ ముఖ్య మంత్రి దామోదరం సంజీవయ్యకు సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, చిత్తూరు నగర మేయర్ అముద, అసిస్టెంట్ కలెక్టర్ హిమ వంశీ, చిత్తూరు నగర ఉప మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, డిఆర్‌ఓ కె. మోహన్ కుమార్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చెన్నయ్య, డీఈఓ వరలక్ష్మి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మూర్తి, కలెక్టరేట్ ఏ ఓ కులశేఖర్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ యుగంధర్, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్యకు చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఘన నివాళులు అర్పించారు. నగరపాలక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి మేయర్ ఎస్ అముద, కమిషనర్ పి నరసింహ ప్రసాద్, సహాయ కమిషనర్ ఎ ప్రసాద్, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టరు లోకేష్, ఏసీపీ నాగేంద్ర, సీఎంఎం నాగేంద్ర, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


కుప్పంలో

కుప్పం టౌన్ : కుప్పం పురపాలక సంఘం కార్యాలయంలో ఫ్లోర్ లీడర్ జిమ్ దాము ఆధ్వర్యంలో దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు నిర్వహించారు. దామోదరం సంజీవయ్య చిత్ర పటానికి పూలమాలవేసి నివాళు లు అర్పించారు. అనంతరం సంజీవయ్య ముఖ్యమంత్రిగా రాష్ట్రానికి చేసిన సేవలను పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసరావు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షులు జాకీర్ అహ్మద్, నాయకులు గిరిప్రసాద్, పురపాలక సంఘం సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

భూ రిజిస్టర్లు వారం రోజుల్లో పూర్తి చేయాలి
సమీక్షా సమావేశంలో కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి- చిత్తూరు:

డికెటి, ప్రభుత్వ, వెబ్ ల్యాండ్, దేవాదా య, కోర్టులో ఉన్న భూములకు సంబంధించి సెటిల్‌మెంటు, రిజిస్టర్లు మూడు వారాలలోగా పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్ జి విద్యాధరి, డిఆర్‌ఓ మోహన్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ హిమ వంశీ లతో కలసి డిఐఓలు, సర్వే అఫ్ ఇన్‌స్పెక్టర్స్, ఆర్ఎస్‌డిటిలు, మండల సర్వేయర్ల, గ్రామ సర్వేయర్ల, విఆర్‌ఓ లతో రీసర్వే పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డికెటి, ప్రభుత్వ, వెబ్ ల్యాండ్, దేవాదాయ, కోర్టులో ఉన్న భూములకు సంబంధించి సెటిల్‌మెంటు రిజిస్టర్లలోఏదైనా కరెక్షన్స్ ఉంటే మూడు వారాల్లోపు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామాలలో ఎక్కడెక్కడ రీ సర్వేకి సంబంధించి పెండింగ్ ఉండేది తెలుసు కోవలన్నారు. గ్రామాలలో సర్వే నిర్వహణ లో ఏమైనా సమస్యలు ఉంటే కలెక్టరేట్ లో ఉన్న తహశీల్దార్లు కు వెంటనే తెలియ జేయా లన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 31 మండలాల్లో ప్రతి మండల పరిధిలో ఒకొక్క గ్రామంలో రీ సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని అందులో ఇప్పటి వరకు 13 గ్రామాలలో ఎఫ్‌పిఓయల్‌ఆర్ పూర్తి చేశారని, ప్రస్తుతం రీ సర్వే సందర్భంగా ప్రభుత్వ భూములు గ్రామాల వారీగా హద్దులు గుర్తించడంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా సెటిల్‌మెంటు రిజిస్టర్లు పూర్తి చేయాలని తెలిపారు. ముందు డికెటి, ప్రభుత్వ, వెబ్ ల్యాండ్, దేవాదాయ, కోర్టు కేసులు లకు సంబంధించి భూములు రీ సర్వే నెంబర్లు ఉన్నాయని పరిశీలించుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటి నుండి ప్రతిరోజు ఉదయం 8 గంట లకు మండల సర్వేయర్ల, ఆర్ఎస్‌డిటిలు, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లతో జూమ్ యాప్ ద్వారా రీ సర్వేపై సమీక్షిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ సర్వేయర్ ఏ గణేష్, గుణశేఖర్, డిఐఓలు, సర్వే ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఎస్‌డిటిలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

కేంద్ర ప్రజా వ్యతిరేక బడ్జెట్‌పై విస్తృత ప్రచారం
18న రౌండ్ టేబుల్ సమావేశం సిపిఎం, సిపిఐ నాయకుల పిలుపు


మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో ప్రజా వ్యతిరేక ప్రతిపాదనలను ప్రజలు తిరస్కరిం చాలని దేశ వ్యాప్తంగా వామ పక్షాలు 14 వ తేదీ నుండి 20వ తేదీ వరకు నిర్వహించే నిరసనలో భాగంగా జిల్లాలో చేసే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని సిపిఎం, సిపిఐ నాయకులు పిలుపు నిచ్చారు. ఇందులో భాగంగా ఈ నెల 18వ తేదీ నిర్వహించనున్న రౌండు టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని స్థానిక సిపిఐ కార్యా లయంలో శుక్రవారం నిర్వహించిన సంయుక్త సమావేశంలో సిపిఎం, సిపిఐ నాయకులు ఈ మేరకు పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్‌లు మాట్లాడుతూ ప్రత్యామ్నా య ప్రతిపాదనలు దేశ వ్యాపితంగా ప్రజలకు వివరిస్తూ చేసే కార్యక్రమంలో జిల్లాలో విస్తృతంగా చేపడుతున్నామని తెలిపారు. అందులో భాగంగా నిరసనలు ప్రదర్శనలు, రౌండ్‌టేబుల్ సమావేశాలు, నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. 18వ తేదీ జిల్లా కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గిపోయి ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న ప్రతిష్టంభనను పరిష్కరించడానికి బదులు అందుకు విరుద్ధం గా మోడీ ప్రభుత్వం సంపన్నులకు రాయితీ లివ్వడం, ఖర్చుల్లో కోత పెట్టడం దారుణం అన్నారు. నిరుద్యోగ సమస్యను ఈ బడ్జెట్ పూర్తిగా విస్మరిం చిందని విమర్శించారు. ఆహార సబ్సిడీలు, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, సామాజిక సంక్షేమంపై పెట్టిన ఖర్చు గత ఏడాది కంటే బాగా తగ్గిందని, ఉపాధి పథకానికి అధిక నిధులు కేటా యించలేదన్నారు. ధరల పెరుగుదల, జీఎస్టీ పెంపు దలతో అనేక ఇబ్బందులు పడుతున్న కార్మిక వర్గాన్ని ఈ బడ్జెట్ విస్మరించిందని దుయ్య బట్టారు. ఈ ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ ప్రత్యామ్నాయ ప్రతి పాదనలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. వ్యవసాయ ఉత్పత్తు లకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధ మైన హామీ కల్పించాలని, వ్యవసాయ మార్కెటింగ్‌పై జాతీయ విధాన ముసా యిదాను ఉపసంహ రించాలని, నేషనల్ మానిట్కిజేషన్ పైప్‌లైను ద్వారా చేపట్టే ప్రభుత్వరంగ ప్రైవేటీకరణ చర్యలను, ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు రంగానికి బదలాయించడాన్ని ఆపాలని సూచించారు. బీమా రంగంలో వంద శాతం ఎఫ్‌డిఐలను ఉపసంహరిం చాలని కోరారు. ఉపాధి పథకానికి కేటాయింపులను 50 శాతం పెంచాలని, పట్టణ ఉపాధి హామీ చట్టాన్ని కూడా ప్రవేశపెట్టాలని, వృద్ధాప్య పెన్షన్లు, ఇతర సామాజిక భద్రతా ప్రయోజనాల కోసం కేంద్ర కేటాయింపులు పెంచాలని సూచించారు. ఆరోగ్య రంగ కేటాయింపులను జిడిపిలో 3 శాతానికి పెంచా లని, విద్యా రంగానికి జిడిపిలో ఆరు శాతానికి కేటాయింపులు పెంచాలని కోరారు. ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఆహార సబ్సిడీని పెంచాలన్నారు. ఎస్సి, ఎస్టీ రంగాలకు, మహిళా, శిశు సంక్షేమానికి కేటాయింపులను గణనీయంగా పెంచాలన్నారు. వీటిల్లో ఐసిడిఎస్‌కు కూడా కేటాయింపులు పెరగాలని, స్కీమ్ వర్కర్లకు ఇచ్చే గౌరవ వేతనాల్లో కేంద్రం వాటాను పెంచాలని, రాష్ట్రాలకు నిధుల బదిలీని పెంచాలని సూచించా రు. కేంద్ర ప్రాయోజిత పథకాలకు కూడానిధులను గణనీయంగా పెంచాలన్నారు.ఈ సమావేశంలో సీపీఎం జిల్లా నాయకులు కెసురేంద్రన్, బాల సుబ్రహ్మణ్యం, సిపిఐ నాయకులు మణి పాల్గొన్నారు.

పులిచెర్లలో డిపివో తనిఖీలు


తనిఖీలు నిర్వహిస్తున్న డిపివో సుధాకర్‌రావు

ప్రజాశక్తి -రొంపిచర్ల: పులిచెర్ల మండలంలోని కల్లూరు గ్రామ పంచాయతీ, దేవళంపేట గ్రామ పంచా యతీలలో చిత్తూరు జిల్లా పంచాయతీ శాఖ అధికారి సుధాకర్ రావు శుక్రవారం తనిఖీలు నిర్వహిం చారు. మంగళంపేటలోని మురికినీటి కాలువల సమస్యలపై పులిచెర్ల మండ ల తహశీల్దారు, ఎంపీడీవో లతో కలిసి పరిశీలించి తగు సూచనలు చేశారు. గ్రామ సచివాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం కల్లూరు పంచాయతీలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు నాగరాజుకు సూచనలు ఇచ్చారు.

కుంభమేళాకు ప్రత్యేక బస్సు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: తిరుపతి యాత్రికుల కోరిక మేరకు ఏపీటీడీసి మరో బస్సు యాత్రను మహా కుంభమేళా ప్రయాగరాజ్, ఉత్తరప్రదేశ్ (గంగ, యమున, సరస్వతి నదుల త్రివేణీ సంగమం) సందర్భంగా తిరుపతి నుండి ఏసీ మల్టీఆక్సిల్ వోల్వో ఏసీ బస్సు (45 సీటర్) ప్యాకేజీ టూర్ నీ ఏర్పాటు చేశామని డివిజనల్ మేనేజర్ శ్రీనివాస రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు తిరుపతి నుండి బస్సు ఈ నెల 17వ తేదీ ఉదయం 5 గంటలకు బయలుదేరుతుందని, ఈ నెల 23వ తేదీ సాయంత్రం 5 గంటలకు తిరిగి చేరుకుంటుందన్నారు. ఒకరికి పెద్దలకు రూ. 22,000.00, పిల్లలకు రూ.19,000.00(3 నుండి 10 సం) వరకు(రవాణా ఛార్జీలు వుంటాయని తెలిపారు. ఏసీ, ఫ్రెష్ అప్, గైడ్ సౌకర్యం తో కలిపి) వుంటుందన్నారు. ఒంటిమిట్ట , బాసర, జబల్పూర్ లోకల్ సైట్ సీయింగ్, ప్రయగరాజ్ స్నానం, వారణాసి లోకల్ సైట్ సీయింగ్, మహానంది ప్రాంతాలు చూపుతారని పేర్కొన్నారు. శ్రీనివాసం (టీటీడీ), తిరుపతి నుండి బస్సు బయలుదేరుతుందన్నారు. ఇతర వివరాలకు 9848850099, 9848973985, 9848802099 08772289123, 9848007033 ఫోను నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ఫ్రైడే డ్రై డేను పాటించాలి: జిల్లా వైద్యాధికారి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని వైద్యాధికారులు సూచించారు. చిత్తూరు అర్బన్ హెల్త్ సెంటర్ టెలిఫోన్ కాలనీ పరిధిలోని తేనెబండ సచివాలయం తేనెబండ హరిజనవాడ ఏరియాలో ఫ్రైడే -డ్రైడే సందర్భంగా జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ శుక్రవారం ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలతో కలిసి ఇంటి ఇంటి ఫీవర్ సర్వే, దోమల లార్వా సర్వే నిర్వహించి లార్వాలను గుర్తించి వాటిని తొలగించి తొలగించలేని చోట అబేటుతో పిచికారీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు డెంగీ, చికున్ గున్యా, మలేరియా, బోదకాలు మొదలగు జ్వరాలు రాకుండా వుండాలంటే ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే పాటించాలని, 'దోమ పుట్ట కూడదు – దోమ కుట్టకూడదు' అనే నినాదంతో దోమలు కుట్టకుండా దోమలు తెరలు వాడుకోవాలని ఇంటి చుట్టుపక్కల మురికి నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, మనకు పనికిరాని వస్తువులు ఉదాహరణకు పగిలిన కుండలు, పాత టైర్లు, టెంకాయ చిప్పలు, ప్లాస్టిక్ కప్పులు లేకుండా చూసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్, అసిస్టెంట్ మలేరియా అధికారి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

అధికార పక్షం నేతల దాడి

- సర్పంచ్ భర్తకు తీవ్ర గాయాలు
- ఆస్పత్రికి తరలింపు


గాయపడ్డ మునస్వామి

ప్రజాశక్తి -విజయపురం నగరి : మండలంలోని బీరకుప్పం పంచాయతీ కావేటిపురం వద్ద టిడిపి నేతలు దాడికి పాల్పడడంతో సర్పంచ్ సెల్వి భర్త మునస్వామి తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అతడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతని తలకు తీవ్రగాయం కావడంతో కుట్లువేసి తలకు కట్టుకట్టారు. తనపై దాడికి గల కారణాలను సర్పంచ్ భర్త మునస్వామి వివరించారు. ఆయన కథనం మేరకు..కావేటిపురం లెక్కదాఖలాలో సర్వే నెంబరు 8లోని 7.88 ఎకరాల స్థలం పేరడంగళులో కుంట పోరంబోకుగా చూపుతోందని అడంగళులో ఎ అనంతనరసింహం పేరిట చూపుతున్న నోషనల్ ఖాతాలో ఉందన్నారు. ఈ స్థలాన్ని తాము కొనుగోలు చేశామంటూ నగరికి చెందిన టిడిపి నాయకులు జేసీబీలతో చదునుచేయడం ప్రారంభించారన్నారు. 'ఆ స్థలం కుంట పోరంబోకని దాన్ని ఎలా కొంటారు? చదునుచేస్తారు?' అని వెళ్లి వారిని ప్రశ్నిస్తే 'మేము అనంత నరసింహం అనేవారి వద్ద కొనుగోలు చేశాం.. చదునుచేస్తాం.. నువ్వెవరు అడ్డుకోవడానికి?' అని బెదిరించారన్నారు. అయితే ఈ స్థలం వాస్తవంగా కుంట పోరంబోకు అని పేరడంగళులో వాటి వివరాలు ఉందని ఈ స్థలాన్ని పంచాయతీకి వాడుకోవాలని గతంలో తాను కలెక్టర్‌కు కూడా వినతిపత్రం అందించానన్నారు. స్పందన, రెవెన్యూ సదస్సుల్లోను అర్జీలు ఇచ్చానన్నారు. ఈ విషయాన్నే చదును చేసే వారికి తెలియ పరిచి పనులను ఆపాలని కోరగా వారు తనపై దాడిచేసి గాయపరిచారన్నారు. ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేయనున్నామని తెలిపారు. ఈ విషయమై తహశీల్దారును వివరణ కోరగా కుంట పోరంబోకుగా ఉంటే ఎవరూ ఆక్రమించడానికి వీలు లేదని, స్థలం కొన్నవారు చలానా కట్టి రికార్డులు సమర్పిస్తే తామే సర్వేయరును పంపి కొలతలు వేయిస్తామన్నారు. ఈ విషమమై స్థానిక వీఆర్వో, సర్వయర్లను కూడా హెచ్చరించామని తెలిపారు.


మండల అధికారులతో సమావేశమైన జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి
జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు

ప్రజాశక్తి - రామకుప్పం:

మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా పరిష్క రిం చేందు కు అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వ యంతో కృషి చేయాలని జిల్లా పరిషత్ ఛైర్మన్ శ్రీనివాసులు పేర్కొన్నా రు. మండల పరిషత్ సమావేశ భవనంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులతో శుక్రవారం ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చేపట్టాల్సిన మౌలిక సదుపాయాలను వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జెడ్పీ నిధుల ద్వారా 30 లక్షల రూపాయలను మండలానికి కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో మురళీధర్ రెడ్డి, పంచాయతీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల కడుపు కొట్టొద్దు..

- పాత బస్టాండ్ బాధితులకు అండ
- వైసిపి జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి భరోసా


మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా వైసిపి అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : చిత్తూరు పాత బస్టాండ్ వ్యాపార బాధితుల పొట్ట కొట్టొద్దని, వారికి అండగా వుండి ఆదుకుం టామని వైసిపి ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు భూమన కరుణాకర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. పాత బస్టాండు వ్యాపారుల అంశం రోజు రోజుకూ వివాదాస్పదమవుతోంది. దశాబ్దాలుగా చిరు వ్యాపా రాలతో పొట్ట పోసుకుంటున్న తమను ఉన్నట్లుండి నోటీసు లిచ్చి వెళ్లగొట్టడం తగదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల జీవన ప్రమాణాలను మార్చటమే అభివృద్ధి కానీ , పేదలకు నష్టం కలిగిస్తూ నిర్మించే నిర్మాణాలు అభివృద్ధి కాదని చిరు వ్యాపారులు కన్నీరు మున్నీరయ్యారు. వైసీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి విజయానందరెడ్డి నేతృత్వంలో శుక్రవారం బాధితులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బాధితులను ఉద్దేశించి భూమన మాట్లాడుతూ చిరువ్యాపారుల పొట్ట కొట్టొద్దని, వారికి అండగా వైసీపీ నిలుస్తుందన్నారు. ఇప్పటికే ఈ అంశం తమ అధినేత జగన్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. టీడీపీ ప్రభుత్వం తీరు మార్చుకోక పోతే అవసరమైతే జగన్మోహన్ రెడ్డి చిత్తూరుకు వచ్చి బాధితుల పక్షాన నిలుస్తారని భూమన హామీ ఇచ్చారు. వైసీపీ చిత్తూరు ఇన్‌ఛార్జి విజయానందరెడ్డి మాట్లాడుతూ చిత్తూరు స్థానిక ప్రజా ప్రతినిధి వ్యవహారాన్ని తప్పు బట్టారు. పేదల అంశంలో తన పార్టీలోని సీనియర్ల అభిప్రాయాలను తీసుకొని అడుగులు వేయాలను సూచించారు. బడుగు , బలహీన , ముస్లిం , మైనార్టీ, పేద వర్గాలను రోడ్డుకు ఈడ్చటం తగదన్నారు. ఎక్కడ విలువైన భూమి కనిపిస్తే అక్కడ పసుపు రంగు రేకులతో షెడ్డు వేస్తున్నారని విమర్శించారు. ఈ నిరసనను భగ్నం చేయాలని అధికారులు నిన్నటి నుంచే సోషల్ మీడియా ద్వారా పెద్ద ఎత్తున ప్రచారం చేసినా , బాధితులు ఏ మాత్రం భయపడకుండా తమ గోడు వినిపించడానికి ఈ నిరసనలో పాల్గొనటం హర్షణీయమని కొనియాడారు. ఆరు నూరైనా తాము బాధితుల పక్షాన నిలుస్తామని భరోసా ఇచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

సమస్యలపై స్పందించండి

అధికారులకు ఎంపీపీ ఆదేశం

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: అధికారులు సమస్యలపై స్పందించాలని ఎంపీపీ అమరావతి పేర్కొన్నారు. మండల సర్వసభ సమావేశం ఎంపీడీవో శ్రీధర్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ అమరావతి మాట్లాడుతూ అన్ని శాఖలలో సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించేందుకు తగిన సూచనలు, సలహాలు తీసుకుని ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు. కొన్ని శాఖల సమీక్ష సమావేశం అనంతరం కొందరు ప్రజాప్రతినిధులు వెళ్లిపోవడం వల్ల అధికారులే సమావేశంలో ఉన్న అధికారులే అభివృద్ధి పథకాల గురించి వివరించారు. సమస్యల పరిష్కారం కాని సమావేశాలను నిరసిస్తున్నారని గ్రామాల్లో ఎక్కువ శాతం సంక్షేమ ఫలాలు అందడం లేదని వీటిపై ధ్యాస పెట్టాలని పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక భద్రత పింఛను, సాంఘిక సంక్షేమ శాఖ, అటవీ శాఖకు సంబంధించిన చర్చలు నిర్వహించకముందే సమావేశం ముగించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు శిరీష్ రెడ్డి, జయ కుమార్, కో ఆప్షన్ మెంబర్ ఫిరోజ్ అహ్మద్, మండల ప్రత్యేక అధికారి ఆసిఫ్, తహశీల్దారు బాబు రాజేంద్రప్రసాద్ పలువురు మండల శాఖ అధికారులు నాగేశ్వరరావు, రమేష్, విజయ్ కుమార్, ఆది కేశవులు, వాణి, శ్రీదేవి పాల్గొన్నారు.

కంటి అద్దాలు పంపిణీ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : చిత్తూరు జిల్లా జాతీయ అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యం లో పిసిఆర్ పాఠశాల విద్యార్థులకు కంటి అద్దాలు కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ శుక్రవారం పంపిణీ చేశారు. చిత్తూరు పిసిఆర్ హైస్కూల్ లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 263 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. దృష్టి లోపం వున్న 20 మంది విద్యార్థులకు ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేశారు. చిత్తూరు నగర మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కటారి హేమలత, చిత్తూరు ఉప మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, ఈ కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ డిపిఎం అర్పిత, పిసిఆర్ హైస్కూల్ హెచ్ఎం పూర్వాని, ఇతర సంబంధిత అధికారులు, విద్యార్థిని విద్యార్థులు, ప్రజా ప్రతి నిధులు పాల్గొన్నారు.

నేడు 'స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర'



ఎంపీడీవో హరి ప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో 'స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర'ను శనివారం నిర్వహించాలని ఎంపీడీవో హరి ప్రసాద్ రెడ్డి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం, జిల్లా కలెక్టర్ సూచన మేరకు శనివారం అన్ని కార్యాలయాల్లో మూలం, వనరు పేరుతో నిర్వహిం చాలని తెలిపారు. ఈ సందర్భంగా అన్ని కార్యా లయాలలో లోపల బయట పరిసరాలు శుభ్రం చేసుకోవాలన్నారు. బల్లలు, తలుపులు, కిటికీలు పైకప్పు, రికార్డు గది, టాయిలెట్లు శుభ్రపరచాలని ఆఫీసు గోడల పైన పెరిగిన మొక్కలు తొలగించాలన్నారు. అవసరమైతే మరమ్మతులు చేయించి వినియోగానికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఆఫీస్ లోపల ఇండోర్ మొక్కలు, బయట అవుట్ డోర్ మొక్కలు ఏర్పాటు చేసి సంరక్షించాలన్నారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యకలాపాలు శ్రమదానం ద్వారా చెత్త దిబ్బలను శుభ్రపరిచి తిరిగి ఆ ప్రదేశంలో చెత్త వేయకుండా మొక్కలు నాటాలన్నారు. పంచాయతీలలో ప్రజలకు బహిరంగ ప్రదేశాలలో చెత్త వేయకుండా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అవసరమైన ప్రాంతాలలో ర్యాలీలు, బైక్ ద్వారా ప్రకటిస్తూ దండోరాలు ఆడియో వీడియో ద్వారా అవగాహన కల్పించాలని ఎంపీడీవో తెలిపారు.

పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలి



గర్భిణులకు సలహాలిస్తున్న ఐసిడిఎస్ అధికారులు


ప్రజాశక్తి-సోమల: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పాలు గుడ్లు, పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ హరిత అన్నారు. మండలంలోని ఆవులపల్లి పంచాయతీ రాంపల్లి పరిసర ప్రాంతాలలోని శుక్రవారం గర్భిణులకు ఇండ్లకు వెళ్లి వారి ఆరోగ్య స్థితిగతులు తెలుసుకొని ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం అంగన్వాడీ కేంద్రాల ద్వారా వారికి అందుతున్నాయా లేదా? అని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ ప్రభుత్వం పౌష్టికాహార లోపంతో ఏ బిడ్డ జన్మించకూడదన్న సదుద్దేశంతో గర్భవతులు, బాలింతలకు, చిన్న పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పాలు, గుడ్లు, బెల్లం, పౌష్టికాహారం కలిపిన ప్యాకెట్లు అందజేస్తున్నారని వీటిని తీసుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, ఆయాలు పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి: మనోజ్‌కుమార్



ప్రజాశక్తి -రొంపిచర్ల: అన్నమయ్య జిల్లాలోని గుర్రంకొండ మండలంలో శుక్రవారం ఓ యువతిపై జరిగిన యాసిడ్ దాడికి కారణమైన నిందితులకు ఉరిశిక్ష చదివించాలని రాజంపేట పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షుడు చంద్రగిరి మనోజ్ కుమార్ డిమాండ్ చేశారు. ఇలాంటి దాడికి పాల్పడిన నిందితులు సమాజంలో బతకడానికి అర్హులు కాదని, అలాంటి వారికి ఉరిశిక్ష అమలు చేయడమే సరి అయిన పరిష్కారమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా నిందితులకు శిక్ష పడేలా చూడాలని ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

దోమల నివారణతోనే అంటు వ్యాధుల నియంత్రణ



ప్రజాశక్తి-కుప్పం టౌన్ : దోమల నివారణతోనే అంటు వ్యాధుల నియంత్రణ సాధ్యమని పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన పట్టణ పరిధిలోని దోమల నియంత్రణ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంటు వ్యాధులకు కారణమైన దోమల నియంత్రణకు వారంలో రెండు రోజులు దోమల మందును పట్టణ పరిధిలో పిచికారి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇంటిలోని చెత్తను చెత్త వాహనాలకు అందించి పురపాలక సంఘం సిబ్బందికి సహకరించాలని సూచించారు.

16 న ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - రామకుప్పం: రామకుప్పం లోని శ్రీ వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యస్వామి ఆలయ కమిటీ, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో కుప్పం పిఈఎస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈనెల 16 వ తేదీ ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పిఈయస్ పిఆర్‌వో వెంకటేష్ శుక్రవారం తెలిపారు. ఈ శిబిరంలో ప్రఖ్యాత కంటి వైద్యులచే పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని తెలిపారు. కంటి సమస్యలు ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం సుకోవాలని కోరారు.

నష్టపరిహారం పంపిణీ



ప్రజాశక్తి -రొంపిచర్ల: పుంగనూరు నియోజకవర్గం సదుం, సోమల మండలాల్లో ఇటీవల కాలంలో ఏనుగుల దాడికి పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తరపున టిడిపి ఇంచార్జ్ చల్లా రామచంద్రారెడ్డి నష్టపరిహారం చెక్కులను పంపిణీ చేశారు. పంట నష్టపోయిన రైతులు ప్రభుత్వం అందించిన సహాయ సహకారాలు అందేలా చేసిన చల్లా బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం : ఎంపీ, ఎమ్మెల్యే

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్, యాదమరి: అభివృద్ధి సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద రావు, చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్ , మురళీమోహన్‌లు తెలిపారు. చిత్తూరు నియోజకవర్గంలోని 14 వ డివిజన్లో రూ.9.90 లక్షలు, 21 వ డివిజన్, కట్టుల పల్లె, గాంధ్ర కొత్తూరులో రూ.4.99 లక్షల ఎంపీ నిధులతో నూతనంగా నిర్మించిన సిసి రోడ్లు, చిత్తూరు, మురకం బట్టు ప్రధాన కూడలిలో 10 లక్షల ఎసిఎపి నిధులతో చేసిన అభివృద్ధి, సుందరీకరణ పనులను శుక్రవారం ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్ , కలికిరి మురళీ మోహన్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసిపి పాలనలో చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని, గ్రామాలకు కనీస సదుపాయాలు కూడా కల్పించలేదన్నారు. వైసిపి ప్రభుత్వ ఆనాలోచిత నిర్ణయాలతో రాష్ట్రం అభివృద్ధి ఎంతో వెనకబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక లోటులో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ముందు చూపుతో ప్రగతి వైపు నడిపించే దుకు కంకణం కట్టుకున్నా రన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ అముద, చూడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, నగర కమిషనర్ నరసింహ ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, చిత్తూరు పార్లమెంటు జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్,టిడిపి సీనియర్ నేతలు చంద్రప్రకాష్, కార్పొరేటర్ అశోక్, 14 వ డివిజన్ టిడిపి అధ్యక్షులు మధుబాబు, 21వ టిడిపి అధ్యక్షులు లక్ష్మీపతి నాయుడు, చిత్తూరు పార్లమెంట్ వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు సునీల్ చౌదరి, యాదవ సాధికార జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు కంటి పరీక్షను నిర్లక్ష్యం చేయొద్దు: ఎమ్మెల్యే



కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఐరాల: విద్యార్థులు కంటి వైద్య పరీక్షలను నిర్లక్ష్యం చేయొద్దని ఎమ్మెల్యే మురళీమోహన్ పేర్కొన్నారు. ఐరాల మండలం ఆగరంపల్లె జెడిపి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎమ్మెల్యే కంటి అద్దాలను శుక్రవారం పంపిణీ చేశారు. కంటి అద్దాల పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో కంటి వైద్యులు సుమారు 400 మంది విద్యార్థిని, విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి లోపం కలిగిన 27 మంది విద్యార్థులకు ఎమ్మెల్యే కంటి అద్దాలు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే పాఠశాల విద్యార్థులతో బోధన విధానం తెలుసుకుని కంటి ఆరోగ్య ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కళ్ళ గొప్ప వరం అని, మనం ఈ అందమైన ప్రపంచాన్ని చూడటానికి, తెలుసుకోవడానికి, నేర్చుకోవడానికి కంటి చూపు ఎంతో ముఖ్యమైందన్నారు. అయితే చాలా మంది కంటి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల, అంధత్వం వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారని, దీన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవడం, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరమని వివరించారు. తల్లిదండ్రులు తమ తమ పిల్లల కంటి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థులు తరగతిలో బోర్డు చూడలేకపోవడం, చదివే సమయాల్లో కళ్లకు ఒత్తిడి ఎక్కువ కావడం వంటి సమస్యలను నిర్లక్ష్యం చేస్తే, భవిష్యత్తులో మరింత పెద్ద కంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంటుందన్నారు. దీనిపై తగు శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐరాల మండల టిడిపి అధ్యక్షులు గిరిధర్ బాబు, జాతీయ అంధత్వ నివారణ సంస్థ ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న మండల వ్యవసాయాధికారిణి

రైతులకు విశిష్ట సంఖ్య తప్పనిసరి: ఏవో

ప్రజాశక్తి - వికోట : రైతులు విధిగా రైతు విశిష్ట సంఖ్యను పొందాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి రాజ్యలక్ష్మి తెలిపారు. మండల పరిధిలోని గోనమాకులపల్లి లో రైతు విశిష్ట సంఖ్యను పొందడంపై రైతులకు అవగాహనా సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు నాగపద్మిని హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు విశిష్ట సంఖ్యను పొందడానికి రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్ కార్డు లింక్ చేసిన మొబైల్ నెంబరు తీసుకురావాలని సూచించారు. 11 అంకెల విశిష్ట సంఖ్య రైతుకు గుర్తింపుగా ఉంటుందన్నారు. దీని ద్వారా కేంద్ర, రాష్ట్ర పథకాలు పొందవచ్చని తెలిపారు. రైతు సేవా కేంద్రం ద్వారా ఈనెల 27 వ తేదీ లోపు ఈ నెంబర్లు పొందాలన్నారు. ఈ కార్యక్రమంపై అవగాహన, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రాజ్యలక్ష్మి , వ్యవసాయ సహాయకులు హరినాథ్ , రైతులు పాల్గొన్నారు.



సైకిళ్లు పంపిణీ చేస్తున్న స్టేట్ బ్యాంకు అధికారులు

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

ప్రజాశక్తి - యాదమరి: సుదూర ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులు కు చిత్తూరు స్టేట్ బ్యాంక్ ఆర్ ఎం డి సురేష్ బాబు, చీఫ్ మేనేజర్ రాజేష్, బ్యాంక్ మేనేజర్ శిరీష ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనాలు ,సైకిళ్లు పంపిణీ చేశారు. చిత్తూరు స్టేట్ బ్యాంక్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రీజనల్ మేనేజర్ సురేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పటి నుంచి అంకిత భావంతో చదువుకొని అన్ని రంగాల్లో రాణించాలని మంచి ప్రయోగికులు కావాలని సూచించారు. పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని, ఆ దిశగా పరీక్షలు బాగా రాయాలని ఆకాంక్షించారు. యదమరి మండలంలోని జీవన గీత, భవిత, కమల్, ఫాతిమా, షానా, , కేథలిన్, జలజ, రితిక, నేహా, జోత్స్నా, ప్రియదర్శిని, పదిమంది పదో తరగతి విద్యార్థులకు సైకిల్ పంపిణీ చేశారు. సైకిల్ పంపిణీ చేయడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు బ్యాంక్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యదమరి పాఠశాల హెచ్ఎం గిరి రాజారావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సచివాలయ రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని ముక్కలతూరు సచివాలయంలో డాక్టర్ శిరీష రికార్డులను పరిశీలించారు. పుట్టిన బిడ్డ నుండి 18 సంవత్సరాల వయసు వరకు ఉన్న పిల్లలందరికీ ఆరోగ్య సంరక్షణ సేవలు అందించడమే ఆర్బి ఎస్.కె లక్ష్యమని జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ శిరీష, ఎస్‌ఓ రామ్మోహన్ అన్నారు. ఈ సందర్భంగా జిడి నెల్లూరు మండల పరిధిలోని ముక్కలతూరు సచివాలయాన్ని జిల్లా టాస్క్ పోస్టు టీం శుక్రవారం సందర్శించింది. ఈ సందర్భంగా ఆర్‌బిఎస్‌కె జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ అట్టడుగు వర్గాలకు చెందిన చిన్నారులకు సమగ్ర ఆరోగ్య రక్షణ కల్పించాలని ఉద్దేశంతో గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవలు అందజేస్తున్నామన్నారు. చిన్నారులలో ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉంటే సకాలంలో చికిత్స అందే విధంగా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌ఓ ప్రసాద్, డిఇఓ మాది కుమార్, సి హెచ్ ఓ శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం



ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : దశాబ్దాలుగా మండల కాంప్లెక్స్ ను పట్టి పీడిస్తున్న తాగు నీటి సమస్య నేటితో పరిష్కారమైంది. మండల కాంప్లెక్స్ పరిధిలో తాగునీటి కోసం శుక్రవారం బోరు వేశారు ఈ బోర్లు నీరు సంవృద్ధిగా రావడం తో మండల కాంప్లెక్స్ లో తాగునీటి సమస్య పరిష్కారమైందని అధికారులు హర్షం వ్యక్తం చేశారు. తహశీల్దారు లోకనాథ్ పిళ్ళై, ఎంపీడీవో మోహన్ మురళి పూజ చేసి డ్రిల్లింగ్ ప్రారంభించారు. ప్రారంభించిన కొద్దిసేపటికి నీరు రావడంతో ఆనందం వ్యక్తం చేశారు.

ఆత్మ రక్షణకు కరాటే అవసరం..!



ప్రజాశక్తి - రామకుప్పం: విద్యార్థిని,విద్యార్థులకు బాల్యం నుండే ఆత్మ రక్షణకు కరాటే అవసరం ఉందని రామకుప్పం లోని సత్యవాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ కె. సంజయ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాలలోని విద్యార్థినీ, విద్యార్థులకు కరాటే మాస్టర్ లు సింగార్వెల్, సంపత్ లో ఆధ్వర్యంలో కరాటే లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా 25 మంది విద్యార్థులు ఎల్లో బెల్ట్, నలుగురు ఆరంజ్ బెల్ట్ సాధించారు. వీరందరికీ కరస్పాండెంట్, కరాటే మాస్టర్ లు ఉపాధ్యాయ బృందం సర్టిఫికెట్లు అందించి అభినందించారు.

చేతి కొచ్చిన పంటకు నిప్పు

- రూ.15వేలు రూ ఆస్తి నష్టం
- దుండగుల నిర్వాకం

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి : చేతి కొచ్చిన పంట ఉలవ కాయలను నూర్పిడి కోసం రహదారిపై పోసిన కుప్పకు కొందరు దుండగులు నిప్పు పెట్టడంతో రైతుకు రూ.15 వేల నష్టం వాటిల్లిన సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. బైరెడ్డిపల్లి మండలం కమ్మనపల్లి పంచాయతీ పరిధిలో రైతు వెంకటరెడ్డి తనకు చేతికి అందిన పంట ఉలవ కాయలను ఎండబెట్టి నూర్పిడి చేసుకునేందుకు రహదారి వద్దకు చేర్చాడు.అక్కడే కుప్పగా పోసిన ఉలవ కాయలకు గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారు. దీంతో సుమారు 15 వేల రూపాయలు నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ మేరకు బాధిత రైతు వెంకటరెడ్డి విఆర్‌వో ప్రతాప్‌కు ఫిర్యాదు చేశాడు. స్పందించిన విఆర్‌వో వెంటనే ఉలవ పంటను పరిశీలించారు. అగ్ని ఆహుతి కావడంతో ఇది దుర్మార్గ చర్య అని, నష్టం నివేదికను ఉన్నతాధికారికి పంపామని తెలిపారు.

రైతులు అప్రమత్తం

రైతు వెంకటరెడ్డికి చెందిన పంటకు నిప్పు పెట్టడంతో తమ పంటలకు కూడా దుండగులు నిప్పు పెడతారేమోనని ఆందోళన చెందుతూ పంటల వద్ద నిద్ర మాని కాపలా కాస్తున్నారు.



దుండగులు నిప్పు పెట్టడంతో దగ్ధమవుతున్న ఉలవ కాయలు

అమర వీరులకు జోహర్లు..

ప్రజాశక్తి -యాదమరి: పుల్వామా దాడిలో అమర వీరులైన 40మంది భారతవీర సైనికులకు పిఆర్‌టియు సంఘ నాయకులు మండలంలోని వరిగ పల్లె, పెరుమాళ్ళపల్లె ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఘన నివాళులర్పించారు. భారత సైనికులు ధైర్య , సాహసలతో, ప్రాణాలు సైతం లెక్క చేయక దేశం కోసం రాత్రి, పగలు సేనలు అందిస్తుండడం వల్ల మనం రోజూ ప్రశాంతంగా గుండెలపై చేతులు పెట్టుకొని నిద్రపోతున్నామని పిఆర్‌టియు రాష్ట్ర వైస్ ప్రసిడెంట్ కె కనకాచారి అన్నారు. యాదమరి చెందిన జిల్లా మహిళ వైస్ ప్రసిడెంట్ హిమబిందు, మండల మహిళ వర్కింగ్ ప్రసిడెంట్ కాంచన, గుడుపల్లె పిఆర్‌టియు మహిళ కార్యకర్త హేమాలత, అఖిలండేశ్వరి, పాఠశాల విద్యార్థులతో క్యాండిల్స్ వెలిగించి అమర వీరులైన సైనికులకు ఘన నివాళులు అర్పించారు.



యాదమరిలో అమర వీర సైనికులకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు



సైనికుడిని సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం

బైరెడ్డిపల్లి: సైనికుడైన ఎన్ రమేష్‌కు బైరెడ్డిపల్లి మండల బిజె మోడల్ స్కూలు విద్యార్థులు శుక్రవారం ఘన స్వాగతం పలికి ఘన సన్మానం చేశారు. పూల్వామా దాడిలో మృతి చెంది అమర వీరులైన సైనికులకు బిజె మోడల్ స్కూలులో శుక్రవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఆహ్వానితులుగా వచ్చిన సైనికుడు ఎన్ రమేష్‌కు విద్యార్థులు గౌరవ వందనం చేసి కండువా కప్పి, పూలమాలవేసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఎందరో మహానుభావులు త్యాగాలతో నేడు భారతదేశంలో స్వతంత్రంగా బతుకుతున్నామని, వారి త్యాగాలకు ప్రతిఫలమే స్వేచ్ఛ లభించిందని దీన్ని ప్రతి విద్యార్థి గుర్తించి భవిష్యత్తు లో కనీస బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బి జే.మోడల్ స్కూల్ యజమాన్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో సౌకర్యాలపై ఎమ్మెల్యే ఆరా

ప్రజాశక్తి -పలమనేరు: పలమనేరు వంద పడకల ఆస్పత్రిలో రోగుల సౌకర్యార్థం మరిన్ని వసతులు కల్పించాల్సిన అవసరముందని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి పేర్కొన్నారు. పలమనేరులోని తన కార్యాలయంలో ఆసుపత్రి కమిటీ, సిబ్బందితో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రోగులు వారి సహాయకులకు ప్రస్తుతం ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న సౌకర్యాలపై ఆయన ఆరా తీశారు. ఆసుపత్రిలో మెరుగైన సేవలతో పాటు వసతులను కల్పించాల్సి ఉందని ఇంకా అవసరమైన ఏర్పాట్లు ఏవేవి ఉన్నాయని ఆయన వివరాలు తీసుకున్నారు. ఆక్సిజన్ పైపులైను, లిఫ్ట్ ఏర్పాటు, 10 స్ట్రెక్చర్లు, బ్యాక్ రెస్ట్ బెడ్లు, రోగుల సహాయకుల కొరకు బెంచీల ఏర్పాటు, దోమల బెడద లేకుండా కిటికీలకు మెష్ లు, 34 పరుపులతో పాటు కంప్యూటర్, ప్రింటర్ల అవసరమున్నట్లు ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. ఆసుపత్రి ఆవరణలో తక్కువ ధరకు నాణ్యమైన ఆహారం అందేలా క్యాంటీన్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుత నిధులతో రోగులకు మొదటి ప్రాధాన్యత అవసరాలు ఉన్న వాటిని ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. మిగిలిన సౌకర్యాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పూర్తి చేసుకుందామని తెలిపారు. దీంతో పాటు స్థానికంగా దాతల సహకారంతోనూ కొన్నింటిని పూర్తి చేసుకుందామని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ మమతా రాణి, ఆసుపత్రి కమిటీ సభ్యులు నాగరాజు, సుధాకర్ తో పాటు పలువురు వైద్యులు, సిబ్బంది ఉన్నారు.



ఆస్పత్రి సౌకర్యాలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

చిత్తూరు అర్బన్: పుల్వామా ఉగ్ర దాడిలో అమరులైన సైనికులకు చిత్తూరు ఎంపి ప్రసాదరావు , చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ , పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కిరికిరి మురళీ మోహన్, గాంధీ. విగ్రహం ప్రధాన కూడలిలో మాజీ సైనిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కొవ్వొత్తులు వెలిగించి, సైనికులకు నివాళులర్పించి అమరవీరుల త్యాగాలు గుర్తు చేసుకున్నారు.

కార్యదర్శుల సంఘం అధ్యక్షులుగా చంగల్ రాయలు



పంచాయతీ కార్యదర్శిల సంఘం అధ్యక్షులుగా చంగల్ రాయలు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: బంగారుపాళ్యం మండల పంచాయతీ కార్యదర్శిల నూతన కార్యవర్గం ఎంపిక మండల కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. మండ ల పంచాయతీ కార్యదర్శులు ఏకగ్రీవ ఎన్నిక జరిగిందని కమిటీ సభ్యులు తెలిపారు. అధ్యక్షులుగా చంగల్ రాయలు, ఉపాధ్యక్షులుగా కవిత, ప్రధాన కార్యదర్శి గుణశేఖర్, ఉప కార్యదర్శి హరిత , రెహమాన్ కోశాధికారి అవంతి సభ్యులు రఘుపతి, గౌరీ శంకర్ , నస్రిన్, కార్తీక్, రాజేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలి పారు. అధ్యక్షులు చెంగల్ రాయ లు మాట్లాడుతూ పంచా యతీ కార్యద ర్శు ల సమస్యలపై అను నిత్యం పోరాడి రావలసిన హక్కులను సాధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ కార్యదర్శులు పా ల్గొన్నారు.

భద్రత నియమాలు పాటించాలి: డిటిసి

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ విధిగా రోడ్డు భద్రతతో పాటు నియమాలు పాటించాలని డిటిసి నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఎట్టేరి శ్రీభానోదయ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో నిర్వహించిన రోడ్డు భద్రత వారోత్సవాల అవగాహన కల్పించారు. డిటిసి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతివేగం నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల జిల్లాలో ప్రమాదాల స్థాయి పెరిగిందని తెలిపారు. మెయిన్ రోడ్డుల వద్ద మలుపుల్లో వేగనిరోధకాలు ఏర్పాటు చేసినప్పటికీ అతివేగం కారణంగా ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. యువకులు హెల్మెట్లు పెట్టుకోకుండా, మద్యం మత్తులో ద్విచక్ర వాహనం పై వేగంగా వెళ్లడం వల్ల ప్రమాదాలకు దారితీస్తుందన్నారు. ఆర్టీవో సునీల్ కుమార్ మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రమాదాలపై వాహననడిపే వారు చైతన్య వంతులు కావాలన్నారు. చదువుతోపాటు అన్ని క్రీడా పోటీలకు ఆతిథ్యం ఇచ్చే భానోదయ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో రోడ్డు భద్రత వారోత్సవాలపై క్విజ్ పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. భానోదయ స్కూల్ కరస్పాండెంట్ నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ లావణ్యలు మాట్లాడుతూ ఒక రోడ్డు ప్రమాదం కారణంగా కుటుంబాలు విచిన్నమైన సందర్భాలు అనేకంగా ఉన్నాయని వాహన చోదకులు తగిన భద్రతా ప్రమాణాలు పాటించాలని కోరారు. వ్యాసరచన క్విజ్ పోటీల విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతుల ప్రదానం చేశారు. తర్వాత విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. ఈ కార్యక్రమంలో ఎంవి ఐలు రాజేశ్వరరావు, నరసింహులు, వాసుదేవ రెడ్డి , స్కూల్ ఇన్‌చార్జి లు మణిమేఖలై, మౌనిక, పలువురు టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న డిటిసి నిరంజన్ రెడ్డి

క్రైం న్యూస్

కోడిపందేల కేసులో ఏడుగురు అరెస్ట్

ప్రజాశక్తి -విజయపురం, నగరి : నగరి మున్సిపల్ పరిధి కాకవేడు మిట్టిండ్లు వద్ద కోడిపందేలు ఆడుతుండగా ఏడుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి కోళ్లు, రూ.630 నగదు స్వాధీనం చేసుకున్నారు. గేమింగ్ యాక్ట్ 35/2025 సెక్షన్ 9(1) మేరకు కేసు నమోదచేసి శుక్రవారం కోర్టులో హాజరు పరచగా వారికి ఒక్కొక్కరికి రూ.500 వంతున జరిమానా విధించారు.

కార్డెన్ అండ్ సెర్చ్

ప్రజాశక్తి -విజయపురం, నగరి : మండలంలోని మాంగాడులో డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీలో రికార్డులు లేని పది చోరీ మోటారు బైక్‌లు, 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. గ్రామస్థులకు సారా అమ్మకాల వల్ల కలిగే నష్టాల గురించి, చోరీ బైకులు కొంటే ఏర్పడే సమస్యల గురించి గ్రామస్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐ మహేశ్వర్, పోలీసులు పాల్గొన్నారు.

జెఈఈలో సదుం గురుకుల విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - సదుం : జెఈఈ ప్రవేశ పరీక్షలలో సదుం మహాత్మా జ్యోతి బాపూలే బిసి గురుకుల జూనియర్ కళాశాలలో ఎంపిసి, రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఎం లక్ష్మీనారాయణ అత్యంత ప్రతిభ కనపరిచి 77.98 శాతం మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి శ్రీనివాసుల రెడ్డి పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థి లక్ష్మీనారాయణ ఇదే పాఠశాల క్యాంపస్ లో పదో తరగతిలోనూ మంచి మార్కులు సాధించినట్లు ఆయన తెలిపారు. జెఈఈ ప్రవేశ పోటీ పరీక్షలకు సూచనలు, సహకారం అందించిన ప్రిన్సిపాల్ వి శ్రీనివాసుల్ రెడ్డికి, మ్యాథమెటిక్స్ లెక్చరర్లు మస్తానయ్య, స్వాతి, ఫిజిక్స్ లెక్చరర్ శ్రీనివాసులు కు,కెమిస్ట్రీ లెక్చరర్ హరికృష్ణకు, ఇంగ్లీష్ లెక్చరర్ ధన శేఖర్‌కు విద్యార్థి లక్ష్మీనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. ప్రిన్సిపాల్, లెక్చరర్ల బృందం విద్యార్థి లక్ష్మీనారాయణ ను ప్రత్యేకంగా అభినందించారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థి లక్ష్మీనారాయణ తండ్రి వెంకటరమణ స్విమ్స్ హాస్పిటల్‌లో జిరాక్స్ ఆపరేటర్ గా పని చేస్తున్నాడు. తల్లి లావణ్య గృహిణి.. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించిన విద్యార్థి లక్ష్మీనారాయణ పట్టుదలగా చదివి జెఈఈ ప్రవేశ పోటీ పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనపరిచినందుకు పలువులు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనను అభినందించారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించండి: ఈవోఆర్‌డి

ప్రజాశక్తి -సోమల: మండలంలోని అన్ని పంచాయతీలలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి పంచాయతీ కార్యదర్శులు తర్వాత చూపాలని ఈవో ఆర్డీ లక్ష్మీదేవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన సోమల లోని వారపు సంత వద్ద రోడ్డుకు ఇరువైపులా చెత్తాచెదారాన్ని తొలగించడం, మురుగునీటి కాలువలను శుభ్రం చేయించడం పారిశుద్ధ్య కార్మికుల ద్వారా చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న వేసవి దృష్ట్యా గ్రామాలలో ఎక్కడ కానీ తాగునీటి సమస్య తెలెత్తకుండా పైప్ లైన్ల మరమ్మతు బోరు మోటార్ల మరమ్మతులు పూర్తి చేయాలని, పారిశుధ్యానికి ప్రాధాన్యతనిచ్చి దోమలు ప్రబలకుండా మురుగునీటి కాలువలు శుభ్రం చేయడం చెత్తాచెదారాలను తొలగించడం చేయాలన్నారు. ముఖ్యంగా వీధి దీపాల ఏర్పాట్లకు ఎలాంటి అలసత్వం వహించవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆనంద్, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఉత్తమ లోగోకు రూ.పదివేలు

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : ఉత్తమ లోగోకు పదివేల రూపాయల నగదు ప్రోత్సాహకం అందివ్వనున్నట్టు కడా అధికారులు తెలిపారు. తదేకం ఫౌండేషన్, కడా ఆధ్వర్యంలో కుప్పం టూరిజం అభివృద్ధికి లోగో డిజైన్ కాంపిటీషన్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఔత్సాహిక అభ్యర్థులు కుప్పం టూరిజం అభివృద్ధి కోసం ఒక లోగో, క్యాప్షన్ ను తయారు చేయవచ్చని, వారు తయారు చేసిన లోగో, క్యాప్షన్ ను పిడిఎఫ్ ఫార్మాట్లో వాట్సాప్ ద్వారా గాని, మెయిల్ ఐడికి గాని పంపంచాలని సూచించారు. తమకు అందిన లోగోలలో అత్యుత్తమమైన ఒక లోగోకి పదివేల రూపాయలు నగదు బహుమతి తదేకం ఫౌండేషన్ అందిస్తుందని తెలిపారు. ఔత్సాహిక అభ్యర్థులు ఈ పోటీలో పాల్గొనవచ్చని పిలుపునిచ్చారు.



విద్యా సామగ్రి అందిస్తున్న దృశ్యం

విద్యా సామగ్రి వితరణ

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : ఎస్ఆర్ పురం మండలం లోని ఆరి మాకులపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి, అమృత భారతి ఫౌండేషన్ సంయుక్తంగా తెలుగు సాంస్కృతిక సమితి కోశాధికారి పైనేని మురళి చేతుల మీదుగా విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. విద్యార్థులకు జామెంట్రీ బాక్సులు, పెన్నులు, పుస్తకాలతో పాటు వేమన శతకం, నీతిచంద్రిక ,వివేకానంద జీవిత సారాంశం లాంటి పుస్తకాలను బహూకరించారు. పాఠశాల లైబ్రరీకి తెలుగు సాహిత్య నీకు సంబంధించిన పుస్తకాలను బహుకరించారు. ఈ సందర్భంగా ఆముదాల మురళి మాట్లాడుతూ చదువుకు మించిన సంపద లేదని ఇష్టపడి చదివితే అన్ని సాధ్యమే అన్నారు. తెలుగు సంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీ నాధంనాయుడు మాట్లాడుతూ చదువుతోపాటు సామాజిక దృక్పథం పెంచుకోవాలని జీవితంలో ఉన్న స్థాయికి ఎదగాలని సూచించారు. కోశాధికారి మురళి చదువుకున్న పాఠశాలలో ఒక్కరోజు గడపాలని ఉద్దేశంతోనే దాదాపు 25 వేల రూపాయలు రిసీవ్ చేసే విద్యాసామగ్రిని అందించమన్నారు. విద్యార్థులకు సహపంక్తి భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యులు రమేష్, స్థానిక సర్పంచ్ దామోదర్ నాయుడు ఉపాధ్యాయులు త్రిలోక్, హిమాచలపతి . పూర్వ విద్యార్థులు సురేష్, చాణిక్య, విజయేంద్ర నాయుడు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడే ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి-కుప్పం టౌన్ : ద్రవిడ విశ్వవిద్యాలయంలో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ద్వారా న్యూ కాంప్లెక్స్‌లో ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తున్నట్టు అధికారులు తెలి పారు. ఈ నియామకాలలో బెంగళూ రు లోని రోమన్ సాంకేతిక ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ పాల్గొన్న నున్నట్టు తెలిపారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో శనివారం ఉదయం 11 గంటలకు నియామకాలు ప్రారంభమవుతాయని తెలిపా రు. ఈ అవకాశాన్ని బీకాం, బీబీఏ, ఎంబీఏ విద్యార్థిని విద్యారులు సద్వినియోగం చేసుకోవాలని విశ్వవిద్యాలయ అధికారులు సూచించారు.